ఎస్‌పి మానవత్వం

క్షతగాత్రుడిని తన వాహనంలో రిమ్స్‌కు తరలింపు

శ్రీకాకుళం : ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తిపై ఎస్‌పి జి.ఆర్ రాధిక మానవత్వం కనబరిచారు. ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించి మంగళవారం సాయంత్రం నరసన్నపేట నుంచి తిరిగి వస్తున్న క్రమంలో శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై ప్రమాద ఘటనను చూశారు. తన వాహనాన్ని ఆపి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రున్ని తన వాహనంలో ఎక్కించుకుని రిమ్స్‌కు తీసుకొచ్చారు. అత్యవసర విభాగంలో చేర్పించి అవసరమైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

సిఎం సారూ.. సమస్యలు వినరూ..

- సిఐడి కేసులతో అపరిష్కృతంగా వంశధార షట్టర్ల సమస్య
- ఆధునికీకరణకు నోచుకోని వంశధార ఎడమ కాలువ పనులు
- సుడిదోమ పోటుతో వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- నేడు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాకు రాక
- నరసన్నపేటలో నేడు భూ హక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. నరసన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంఠ నిర్వహించనున్న రెండో విడత వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం హక్కు పత్రాలను రైతులకు అందించనున్నారు. రెండో విడత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు ప్రకటించనున్న వరాలపై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు జిల్లాలో వ్యవసాయ, సాగునీటిరంగ సమస్యలు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయి. వీటిలో నరసన్నపేట నీటిపారుదల శాఖలో గతంలో షట్టర్ల అవినీతిపై సిఐడి నమోదు చేసిన కేసు ఫలితంగా ఏళ్ల తరబడి ఆ సమస్య పెండింగ్‌లో ఉండడంతో కొత్తవి ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారుతున్నా వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు ఆధునికీకరణకు నోచుకోవడం లేదు. వీటితోపాటు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుడిదోమ పోటుతో వేలాది ఎకరాల్లో వరి రైతులు నష్టపోయారు. సమస్యలకు ఏం పరిష్కారం చూపుతారోనని సిక్కోలు జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాలువలు ఆధునికీకరణ పనులకు నోచుకోలేదు. ప్రధానంగా ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. ఆధునికీకరణ పనులకు రూ.834 కోట్లు అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. గొట్టాబ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉన్నాయి.

వంశధార షట్టర్ల సమస్య తీరేదెప్పుడో?

పొందూరు మండలం గోకర్ణపల్లిలో ఎండిపోయిన పంటను చూపిస్తున్న రైతు (ఫైల్)

వంశధార శివారు భూముల సాగునీటికి షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన జరిగి 13 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు. కేసు తేలకపోవడంతో కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కార్యాలయాల్లో సుమారు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల విలువ చేసే షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. మరోవైపు సీజ్ చేసిన షట్టర్లు తుప్పు పట్టిపోవడంతో కోట్లాది రూపాయాల ప్రజాధనం వృథా అవుతోంది. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. సాగునీటి సలహా మండలి, జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు తదితర సందర్భాల్లో జలవనరులశాఖ అధికారులు పలు పర్యాయాలు ప్రస్తావిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీనిపై సిఎం స్పందిస్తే షట్టర్ల సమస్య తీరనుంది.

సుడిదోమ పోటుతో నష్టపోయిన సిక్కోలు రైతాంగం

జిల్లాలో సరిగ్గా పంట కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో వరికి సుడిదోమ సోకి రైతు వెన్ను విరిచేసింది. సుడిదోమ దుబ్బులు అడుగున చేరి రసాన్ని పీల్చేస్తుండడంతో దోమ వ్యాపించిన ప్రాంతమంతా పంట ఎండిపోయింది. ప్రయివేట్ దుకాణాల్లో క్రిమి సంహారక మందులను కొని వినియోగించినా ఫలితం కనిపించలేదు. జిల్లాలో 62.5 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 12.5 వేల ఎకరాల్లో పంట పూర్తి దెబ్బతినగా, మరో 50 వేల ఎకరాల్లో పాక్షికంగా నష్టం వాటిల్లింది. సుడిదోమ పంట దిగుబడులపైనా ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. నష్టపోయిన మేరకు పంటకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

హామీల్లో నెరవేరినవి సగమే

వంశధారపై గొట్టాబ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ.189 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం న్యాయ సమీక్షకు ఇచ్చారు. మహేంద్రతనయ, ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు మంజూరు చేసిన రూ.855 కోట్లు పనులనూ న్యాయ సమీక్షకు పంపారు. ఇంటిగ్రేడెట్ కలెక్టరేట్ కాంప్లెక్స్ పూర్తి చేయడానికి అదనంగా మరో రూ.69 కోట్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం నగరంలో టిడిపి హయాంలో కూలగొట్టిన కోడిరామ్మూర్తి స్టేడియం బాగు చేయడానికి అదనంగా రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా ఉత్తర్వులు ఇవ్వలేదు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస నాలుగు లైన్ల రోడ్ల విస్తరణలో భవనాలు కోల్పోనున్న వారి కోసం రూ.18 కోట్లు మంజూరు చెప్పినా ఇంతవరకు కనీసం ఉత్తర్వులు కూడా జారీ చేయలేదు. ఉద్దానం ప్రాంతంలోని 807 గ్రామాల్లో కిడ్నీ బాధితులకు రక్షిత మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం రూ.700 కోట్లతో మంచినీటి ప్రాజెక్టును చేపట్టిందని, సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. పాతపట్నం నియోజకవర్గంలోని మూడు మండలాల ప్రజలకు తాగునీటి కోసం రూ.265 కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించినా ప్రభుత్వం నుంచి మంజూరు ఉత్తర్వులు రాలేదు.

జిల్లాకు సిఎం రావడం ఐదోసారి

ఆధునికీకరణకు ముఖ్యమంత్రి పదవిని అధిష్టించిన తర్వాత జిల్లాకు రావడం ఇది ఐదో పర్యాయం. తొలిసారి 2019 సెప్టెంబరు ఆరో తేదీన ఇంటింటికీ రేషన్ పంపిణీ పథకం పైలట్ ప్రాజెక్టును పలాస నుంచి ప్రారంభించారు. తర్వాత గతేడాది నవంబరు తొమ్మిదో తేదీన పాతపట్నంలో నిర్వహించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమార్తె వివాహానికి హాజరయ్యారు. జూన్ 26వ తేదీన అమ్మఒడి పథకం డబ్బులను ఇక్కడ నుంచే తల్లుల ఖాతాలో వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఆగస్టు ఎనిమిదో తేదీన శాసనసభాపతి తమ్మినేని సీతారాం తనయుని వివాహానికి వచ్చారు. ఇప్పుడు నరసన్నపేటలో నిర్వహించనున్న రెండో విడత వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం హక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు వస్తున్నారు.

ఆదరాబాదరాగా భూ సర్వే

భూ సమగ్ర సర్వే విషయంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో సర్వేను ఆదరాబాదరాగా చేశారన్న విమర్శలు ఉన్నాయి. పరికరాలు, సిబ్బంది కొరతతో చాలాచోట్ల ఇబ్బందులు తలెత్తాయి. ఇతర ప్రాంతాల నుంచి అదనపు బృందాలను వేసినా అక్కడ పరిస్థితులపై సిబ్బందికి అవగాహన లేకపోవడం, తగినంత సహకారం లేకపోవడంతో సర్వేకు ఆటంకంగా మారింది. సర్వేలో అనేక చోట్ల తప్పిదాలు చోటుచేసుకున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలో 350 గ్రామాల పరిధిలోని 1,40,775.13 ఎకరాల విస్తీర్ణం మేర రీ సర్వే పూర్తయింది. భూ హక్కు పత్రాలు పొందేందుకు 1,12,290 మందిని అర్హులుగా గుర్తించారు. ఇప్పటివరకు 48,404 భూ హక్కు పత్రాలను ముద్రించారు. సర్వే పూర్తయిన మేరకు 4,76,790 హద్దు రాళ్లు అవసరమని గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 785 సరిహద్దు వివాదాలను పరిష్కరించినట్లు అధికారులు చెప్తున్నా, మొత్తం ఎన్ని వచ్చాయనేది చెప్పలేకపోతున్నారు. నోషనల్ ఖాతాలు, మిస్సింగ్ సర్వే నంబర్లు తదితర సమస్యలను 5,650 వరకు పరిష్కరించినట్లు నివేదికల్లో పొందుపరిచినా మొత్తం ఎన్ని ఫిర్యాదులు అందాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ధర్నాలో మాట్లాడుతున్న పురుషోత్తం నాయుడు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఆర్థిక సంబంధ బకాయిలు విడుదల చేయాలి
- ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు
- కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ ఎరియర్స్, సరెండర్ లీవ్, ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ఆర్థిక సంబంధమైన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య దూరం పెరుగుతోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలపై చేస్తున్న పోరాటాలను నీరుగార్చేందుకు ప్రభుత్వ అనుకూల సంఘాలు తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. పిఆర్‌సిని సాధించుకోలేకపోవడానికి దీన్నే ప్రభుత్వం ఆయుధంగా వినియోగించిందన్నారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా 2022 మార్చి నాటికి బకాయిలు చెల్లిస్తామని చెప్పినా ఇంతవరకు ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. రాష్ట్రంలో రూ.2,500 కోట్లు బకాయిలు ఉంటే, ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే రూ.160 కోట్లు ఉన్నాయని తెలిపారు. వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. సిపిఎస్ రద్దు కోసం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పిఎఫ్ బకాయిలు ఎనిమిది నెలలుగా చెల్లించడం లేదని, దీనివల్ల వివాహాలు, ఆరోగ్య సమస్యలున్న వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎస్ ఉద్యోగులు డిఎ ఎరియర్స్‌కు ఇన్‌కమ్ టాక్స్ చెల్లించినా ఎరియర్స్ బకాయిలను మాత్రం ప్రభుత్వం చెల్లించలేదన్నారు. సరెండర్ లీవ్, ఇతర ఆర్థిక సంబంధమైన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. పెన్షనర్లు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తీసుకోకుండా కాలం చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. బకాయిలు తక్షణమే చెల్లించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై అధికారంలోకొచ్చాక మాట మార్చడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఢోకా లేదని చెప్తూనే చెల్లించాల్సిన జీతాలు, బకాయిల విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జి.గిరిధర్, ఆర్.మోహనరావు, ఎల్.బాబూరావు, కె.రమేష్, జి.మాధవరావు, ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పన్నులతో పేదల సొమ్ము లూటీ

- రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన
- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సంక్షేమ పథకాలను ఎరగా చూపి పన్నులు, ధరల పెంపుతో వైసిపి ప్రభుత్వం పేదల సొమ్మును లూటీ చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' పేరుతో మంగళవారం నిర్వహించిన నాలుగు నియోజకవర్గాల కేడర్ శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందన్నారు. ప్రజలను మభ్యపెట్టి పథకాల పేరిట మోసం చేస్తూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో మూడున్నరేళ్లలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నుంచి రహదారుల వరకు ఒక్క పైసా ఖర్చు చేయలేదని విమర్శించారు. రైతుల భూములపై కన్నేసి వాటిని కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు.

ఇసుక, మద్యం మాఫియా రాజ్యమేలుతోందని విమర్శించారు. అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారిందన్నారు. పథకాల పేరుతో ఉన్న సౌకర్యాలను రద్దు చేస్తూ పేదలను మరింత పేదలుగా మార్చారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్, ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, మొదలవలస రమేష్, సింతు సుధాకర్, చిట్టి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరీష

కృత్రిమ మేధస్సుపై సదస్సు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

కేంద్ర విద్యాశాఖ, ఎఐసిటిఇల సౌజన్యంతో నిర్వహిస్తున్న 'విద్యాంజలి' కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఎం, సిఎస్‌టి విభాగాల ఆధ్వర్యాన కృత్రిమ మేధస్సుపై మంగళవారం ఆన్‌లైన్ సదస్సు నిర్వహించారు. భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవశ్యకత, నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ ఐఎఫ్ఎంఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిషా వివరించారు. ఈ రంగంలో విద్యాభ్యాసం చేస్తున్న వారికి ఏయే రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయో తెలిపారు.

వ్యక్తిగత శిక్షణ, ఆటోమిషన్, కార్యాలయ నిర్వహణ, అవినీతి నిరోధం, వాయిస్ అసిస్టెంట్, ఈ కామర్స్ వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు ప్రాధాన్యతపై విపులంగా వివరించారు. విద్యార్థులను చైతన్యపరిచే ఇటువంటి సదస్సులు ముమ్ముందు మరిన్ని నిర్వహించాలని సూచించారు. సదస్సులో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ శ్రీనివాసరావు, ఐక్యుఎసి డీన్ డాక్టర్ సిహెచ్.రమేష్, సిఎస్ఎం, సిఎసి హెచ్‌డి డాక్టర్ ఎం.వి.బి చంద్రశేఖర్, విద్యాంజలి నోడల్ ఆఫసర్ ఎస్.భాస్కరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నైర' విద్యార్థికి ప్రథమ ర్యాంకు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అఖిల భారత వ్యవసాయ పరిశోధనా మండలి నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షలో నైరలోని ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థి కె.విక్టర్‌పాల్ ప్రథమ ర్యాంకు సాధించాడు. ప్లాంట్ సైన్స్ విభాగంలో ఆయనకు ఈ ర్యాంకు దక్కింది. ఆయన్ను నైర వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

అరసవల్లిని సందర్శించిన రీజనల్ ఇంటెలిజెన్స్ అధికారి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ ఇంటెలిజెన్స్ అధికారి ఎస్.వెంకటరావు మంగళవారం సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో ఆయనకు స్వామివారి శేషవస్త్రంతో పాటు జ్ఞాపికను ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ అందజేశారు.

సిఎం సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - నరసన్నపేట

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం హక్కు పత్రాలను రైతులకు అందించేందుకు, రెండో విడత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని ప్రారంభించేందుకు బుధవారం జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను రెవెన్యూ మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో తొలిసారి జగ్గయ్యపేట తక్కెళ్ళపాడులో భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి విడతలో రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసుకున్నామని, రెండో విడతకు సంబంధించి నరసన్నపేట నియోజకవర్గంలో శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. రూ.వెయ్యి కోట్ల ఖర్చుతో రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో భూ తగాదాలు లేని గ్రామాలను త్వరలోనే చూస్తామని చెప్పారు. సమావేశంలో డిసిసిబి అధ్యక్షులు కె.రాజేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగి నాయుడు, కణితి కృష్ణారావు, పి.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర మొబైల్ బుక్‌హౌస్ ప్రదర్శన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాలాంధ్ర మొబైల్ బుక్‌హౌస్ ప్రదర్శనను నగరంలోని బాపూజీ కళామందిర్ వద్ద నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా ప్రజలను జాగృతం చేయాలన్న లక్ష్యంతో పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రయత్నం గొప్పదన్నారు. విశాలాంధ్ర ప్రచురణలకే పరిమితం కాకుండా ఇతర ముద్రణలను సైతం ప్రజలకు అందించడానికి వాడవాడల్లో అమ్మకాలు చేయడం ఆనందదాయకమన్నారు. సాహిత్యాభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- 1500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. సిఎం పర్యటన నేపథ్యంలో నరసన్నపేట పట్టణాన్ని ముస్తాబు చేశారు. వైసిపి జెండాలు, సిఎం, ఇతర ప్రజాప్రతినిధుల ఫొటోలతో ఎక్కడికక్కడ హోర్డింగులను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. డిఐజి హరికృష్ణ, ఎస్‌పి జి.ఆర్ రాధిక నేతృత్వాన పటిష్టమైన భద్రతా వలయాన్ని రూపొందించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హెలీకాప్టర్‌లో జిల్లాకు చేరుకున్న దగ్గర నుంచి తిరిగి వెళ్లేంత వరకు ప్రధాన మార్గాలను మూసివేసి ట్రాఫిక్‌ను దారిమళ్లిస్తున్నారు. జమ్ము కూడలి లోని హెలీప్యాడ్‌ను తయారు చేశారు. అక్కడ మూడంచెల వలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన నాయకులను మినహా మిగిలిన వారిని అక్కడికి అనుమతించరు. 1500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష (రీ సర్వే) పథకంలో భాగంగా భూ హక్కు పత్రాలను ముఖ్యమంత్రి చేయనున్నారు. రెండో విడతకు భూ హక్కు, భూ రక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం కోసం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని ముస్తాబు చేశారు. సభా వేదిక పైకి వివిఐపిలకు మాత్రమే అనుమతించనున్నారు. మిగిలిన వారికి స్థభాస్థలిలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల నుంచి పది వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 200 బస్సులను వేయగా, ఇందులో 130 ఆర్‌టిసి బస్సులు ఉన్నాయి. ప్రయివేట్ ఆపరేటర్లు, పాఠశాలల యాజమాన్యాల నుంచి మిగిలిన 70 బస్సులను సమకూర్చారు. రీ సర్వేకు సంబంధించి స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు.

సిఎం టూర్ షెడ్యూల్

ఉదయం 8.50 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.45 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9.55 గంటలకు విశాఖపట్నంలో హెలీకాప్టరులో బయలుదేరి నరసన్నపేట మండలం జమ్ము జంక్షన్‌లోని హెలీప్యాడ్‌కు 10.35కు చేరుకుంటారు. 10.45 వరకు ప్రజాప్రతినిధులను కలుస్తారు. అనంతరం అక్కడ్నుంచి బయలుదేరి రోడ్డు మార్గాన నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి 11 గంటలకు చేరుకుంటారు. పది నిమిషాల పాటు సర్వే స్టాల్స్‌ను సందర్శిస్తారు. 11.15కు సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 11.20కు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ప్రసంగిస్తారు. 11.45 వరకు అతిథుల ప్రసంగం, 11.45 నుంచి 11.55 వరకు ఇద్దరు జగనన్న భూహక్కు లబ్ధిదారులు మాట్లాడతారు. 11.55 నుంచి 12.40 వరకు ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. 12.40 నుంచి 12.50 వరకు ఐదుగురు లబ్ధిదారులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తారు. 12.55కు జూనియర్ కళాశాల నుంచి మైదానం నుంచి బయలుదేరి 1.05 గంటలకు జమ్ము జంక్షన్ వద్ద హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 1.05 నుంచి 1.20 వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు. 1.25 గంటలకు హెలీకాప్టరులో బయలుదేరి 2.05 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

ఏర్పాట్లు పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, డిఐజి ఎస్.హరికృష్ణ, ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి మంగళవారం పరిశీలించారు. సిఎం వెళ్లనున్న రహదారి మార్గంలో ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌పై ఆరా తీశారు. సభాస్థలిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ట్రయల్ రన్

జమ్ము కూడలిలోని హెలీప్యాడ్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు పోలీసు శాఖ కాన్వాయ్ ట్రయల్ రన్‌ను నిర్వహించింది. ప్రధాన మార్గంలో రోడ్డుకు ఇరువైపులా అవసరమున్న చోట్ల అదనపు పోలీసులను నియమించాలని సూచించారు.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఐజి హరికృష్ణ, ఎస్‌పి రాధిక

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. నరసన్నపేటలోని ఒక ఫంక్షన్ హాల్‌లో సిఎం పర్యటన బందోబస్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఎఎస్‌లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు మొత్తం సుమారు 1500 మంది సిబ్బందితో పాటు ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ టాస్క్ సిబ్బంది బందోబస్తు విధులకు కేటాయించామని తెలిపారు. విఐపి కాన్వాయ్ వచ్చే సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో సామాన్య ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సభాస్థలి చుట్టూ ఉండే ఎత్తయిన భవనాలపై రూఫ్ టాప్ బందోబస్తు సిబ్బంది అనుమానిత వ్యక్తులను గుర్తించినట్లయితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. బయట నుంచి వచ్చే వాహనాలు కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు కె.శ్రీనివాసరావు, విఠలేశ్వర్, డిఎస్‌పిలు, సిఐలు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

O.P. 17/2022

బిట్వీన్:
శ్రీమతి బెవర నాగమణి -పిటీషనర్
మరియు
శ్రీ బెవర రాము -రెస్పొండెంట్

రెస్పొండెంట్: బెవర రాము,
S/o. కృష్ణ, ఇంటి నెం. 149,
వీధి నెం. 542, Opp: ZPAPHB కాలనీ,
శ్రీకాకుళం టౌన్,
శ్రీకాకుళం జిల్లా - 532001.

పై నెంబరు గ్రంధంలో శ్రీ కోర్టు ద్వారా రెస్పొండెంట్‌కి సమన్లు పంపించినప్పటికి అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం **ది. 03-01-2023వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం, అడ్వకేట్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
ది.19-11-2022 సెల్:9290188928

ట్రోఫీని అందజేస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

క్రికెట్ టోర్నీ విజేత బిఎల్‌కెసిసి జట్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో రోటరీక్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన సూపర్-6 క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి 18 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో గ్రౌండ్‌తో బిఎల్‌కెసిసి జట్టు తలపడింది. ఈ మ్యాచ్‌లో బిఎల్‌కెసిసి జట్టు విన్నర్‌గా, గ్రౌండ్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ పోటీలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అజయ్ దక్కించుకున్నారు. ఉత్తమ బ్యాట్స్‌మేన్‌గా సురేష్ 68 పరుగులు సాధించారు. ఉత్తమ బౌలర్‌గా శాంతు ఎంపికయ్యారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ చిన్నికి దక్కింది. అనంతరం విజేతలకు ట్రోఫీని టోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, ఎస్.రోహిత్, పి.దినేష్, అమిర్ ఆలీ, గోపాల్, వి.సురేష్, పాక తులసీదాసు, ప్రదీప్, కృష్ణారావు, పిఇటి కృష్ణయ్య, రోటరీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగులతో మాట్లాడుతున్న పురుషోత్తంనాయుడు

27న ఎన్‌జిఒ నగర తాలూకా ఎన్నికలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ శాఖల్లో ఏపి ఎన్‌జిఒ సంఘం మరింత బలోపేతం కావాలని రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ నెల 27న నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో నగర యూనిట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే పది తాలుకాల్లో ఎన్నికల్లో ఏకగ్రీవమయ్యాయని, ఇది శుభ పరిణామని అన్నారు. జిల్లా కేంద్రంలో అదే తరహాలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. వాణిజ్య పన్నులశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపారుదలశాఖ కార్యాలయాలను సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం నాయకులు చల్లా శ్రీనివాసరావు, రాయి వేణుగోపాల్, కె.జయరావు, గోవింద పట్నాయక్, బడగల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఆ ఒక్కడూ వండకపోతే పస్తులే!

- అరకొర సిబ్బందితో వసతిగృహాలు
- ఇన్‌ఛార్జీలతోనే కాలయాపన

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలం పెద్దకర్రివానిపాలెం వసతిగృహంలో వంట మనిషిగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న హనుమాన్‌ప్రసాద్ అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు సమాచారం లేకుండా సెలవు పెట్టాల్సి వచ్చింది. ఈ విషయం ఫోన్ ద్వారా తన వార్డెన్‌కు సమాచారం అందించి, అతను తన పనిమీద వెళ్లిపోయాడు. మరికొద్ది సేపట్లోనే వంట ప్రారంభిస్తాడని అనుకున్న వ్యక్తి అందుబాటులో లేడని తెలిసి వార్డెన్ ముందు కొంత ఆందోళనకు గురయ్యాడు. కానీ విధి నిర్వహణలో తనకు ఉన్న నిబద్ధత, స్థానికంగా ఉన్న పరిచయాలతో గ్రామస్తులతో మాట్లాడితే ఆరోజుకి గండం గడిచింది. ఇటువంటి గండాలనే దాటుకుంటూ ప్రస్తుతం పలాస డివిజన్‌లోని వసతిగృహాలు నడుస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వసతి గృహంలోనూ వార్డెన్, కుక్, అటెండర్, వాచ్‌మేన్ ఉండాలి. కానీ, పలాస డివిజన్‌లోని చాలా వసతిగృహాలు ఇద్దరు మాత్రమే ఉంటున్నారు. అదీ అదనపు బాధ్యతల్లో మాత్రమే.

పలాస డివిజన్‌లో...

పలాస డివిజన్‌లో 19 వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో పి.కె.పాలెం, బొరివంక, రాజపురం, కొలిగాం తదితర వసతిగృహాలు ఒక్కొక్క వంట మనిషితోనే

కవిటి బిసి వసతిగృహం

నడుస్తున్నాయి. దీంతో వీరికి ఏదైనా అత్యవసర పనిపడితే ఆరోజు వంటకు తిప్పలే. వార్డెన్ బాధ్యతలు తీసుకుంటే పర్వాలేదు లేదంటే పిల్లలకు పస్తులే.

అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నా..

జిల్లాలోని మిగతా డివిజన్లలో అదనపు అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నా వాళ్లు ఇక్కడకు రావడానికి మొండికేస్తున్నారు. పలాస డివిజన్ పరిస్థితి తెలుసుకున్న జిల్లా అధికారులు టెక్కలి, శ్రీకాకుళం డివిజన్లలో అదనంగా ఉన్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పలాస వెళ్లమని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సంబంధిత సిబ్బంది తమకు ఉన్న పలుకుబడి, పరిచయాలతో అధికారులపై ఒత్తిడితెచ్చి ఇచ్చిన ఉత్తర్వులు వెనక్కితీసుకునేలా చేస్తున్నారు. దీంతో పలాస డివిజన్ వసతిగృహాలకు తిప్పలు తప్పడం లేదు.

వార్డెన్లకు అదనపు బాధ్యతలు

మరోవైపు డివిజన్‌లో ఉన్న 19 వసతిగృహాలను 8 మంది వార్డెన్లు పర్యవేక్షిస్తున్నారు. దీంతో వీరిపై పనిభారం పెరుగుతోంది. అంతేకాకుండా చాడాల్సిన వసతిగృహాలూ ఒడిశాకు ఆనుకుని ఒకటి ఉంటే శ్రీకాకళం వెళ్లేదారిలో మరొకటి ఉంటోంది. ఉదాహరణకు కంచిలి వార్డెన్ రామారావుకు అటు ఒడిశాకు ఆనుకుని ఉన్న కొలిగాం ఇటు ఉద్దానం ప్రాంతంలోని బొరివంక వసతిగృహాల అదనపు బాధ్యలు అప్పగించారు. దీంతో అతను ఒకటి చూస్తే ఇంకోటి చూడ్డం కష్టంగా మారుతోంది. దీంతో ఎఫ్ఎసిలో డివిజన్‌లో మరో ఐదుగురుని నియమించారు. అయినప్పటికీ వీరికి ఇవి అదనపు బాధ్యతలు మాత్రమే కావడంతో పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంటోంది. ఇటువంటి సమస్యల వలయంలో పలాస డివిజన్ వసతిగృహాలు చిక్కుకున్నాయి. దీంతో తక్షణమే డివిజన్‌లోని వసతిగృహాల్లో ఖాళీ ఉన్న అవుట్ సోర్సింగ్, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాలుగు వసతిగృహాల్లోనే..

పలాస డివిజన్ కేవలం నాలుగు వసతిగృహాల్లో మాత్రమే ఒక్కొక్క వంట మనిషి పనిచేస్తున్నారు. మిగతా అన్ని వసతిగృహాల్లో ఇద్దరేసి చొప్పున, కొన్ని దగ్గర్ల ముగ్గురు చొప్పున వంట మనుషులు ఉన్నారు. ఆ నాలుగు వసతి గృహాల్లోనూ ఖాళీలు భర్తీ చేసాం. కానీ, వివిధ కారణాలతో వాళ్లు విధుల్లో చేరలేదు. ఆ నలుగురిని తొందర్లోనే నియమిస్తాం. ఇక ఎఫ్ఎసిలో ఐదుగురు వార్డెన్లను ఇటీవల నియమించాం.

- ఇ.అనురాధ, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి

వికలాంగునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అర్హతే ప్రామాణికం

ప్రజాశక్తి- జి.సిగడాం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలఖండ్యాం సచివాలయం పరిధిలోని పాలఖండ్యాం, సీతారాంపురం గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించడమే తమ లక్ష్యమని అన్నారు. స్థానికంగా సమస్యలను ప్రజలతోనే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. సీతారాంపురం అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలు, మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించి మధ్యాహ్నం భోజన పథకం అమలు పరిశీలించారు. మెనూను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, వైసిపి మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, వైస్ ఎంపిపిలు తోలేటి వెంకటరావు, మీసాల రాంబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్కా వెంకటసాయి, సిగడాం పిఎసిఎస్ చైర్మన్ ఎర్నేని ప్రకాష్, సర్పంచ్ దారబోయిని వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : రాష్ట్రాభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలిలోని నాలుగో

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని, అనుకున్న దానికంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చింతాడ గణపతిరావు, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, ఏరియా కో-ఆర్డినేటర్ శిష్టు శ్రీరాములు, ఎపిఎం గురుగుబెల్లి నారాయణరావు, ఎపిఒ బగాది ప్రసాదరావు, ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్, గొండెలి సుజాత పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి అప్పలరాజు

తిలక్‌కు మంత్రి సీదిరి పరామర్శ

ప్రజాశక్తి- నందిగాం

కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాతృమూర్తి సత్యమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం పరామర్శించారు. కణితివూరులోని తిలక్ స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ముందుగా సత్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, పాలిన శ్రీనివాసరావు, నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, వైసిపి నాయకులు హనుమంతు రామ్మోహన్‌దొర, అంబొడి విష్ణు, రోణంకి ధర్మారావు, మల్ల సీతారాం రోనంకి బాబూరావు, దానయ్య, హనుమంతు బుజ్జి, కవిటి ఎర్రన్న పాల్గొన్నారు.

భూ సర్వే డిటిగా శ్రీనివాసరావు

ఆమదాలవలస : భూ రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా బాడాన శ్రీనివాసరావు మంగళవారం నియామితులయ్యారు. ఈయన గతంలో ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ప్రభుత్వం భూముల రీ సర్వే కోసం నూతనంగా మండలానికి ఒక పోస్టును మంజూరు చేయడంతో ఈయన ఇక్కడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ రీ సర్వే ద్వారా స్థిరాస్తులకు రక్షణ, యజమానులకు శాశ్వత హక్కులు సంక్రమిస్తాయని అన్నారు.

ఆహార పొట్లాలను అందజేస్తున్న సింహాచలం

పేదలకు ఆహార పొట్లాలు

కోటబొమ్మాళి: మండలంలోని విశ్వనాథపురం పంచాయతీ అనందపురానికి చెందిన వైసిపి నాయకులు నేతింటి సింహాచలం తన తల్లిదండ్రులు నేతింటి అప్పయ్య, నారాయణమ్మ జ్ఞాపకార్థం పలువురుకు మంగళవారం దుప్పట్లు, ఆహార పొట్లాట్లు పంపిణీ చేశారు. జిల్లాలోని చిలకపాలెం నుంచి నందిగాం వరకు జాతీయర హదారిపైన ఉన్న అనాథులు వంద మందికి పైగా ఆహార పొట్లాలు, దుప్పట్లు, నగదు పంపిణీ చేశారు. ఈ పంపిణీపై నియోజకవర్గనికి చెందిన పలువురు వైసిపి నాయకులు సింహాచలంను అభినందించారు.

పంటకోత ప్రయోగాల్లో పాల్గొన్న అధికారులు

గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస, దల్లవలస గ్రామాల్లో ఎఎస్‌ఒ ఎన్.శేఖర్‌బాబు ఆధ్వర్యాన మంగళవారం వరి పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ గ్రామాల్లో చేపట్టిన పంటకోత ప్రయోగాల్లో ఎకరాకు సుమారు 21 నుంచి 22 బస్తాల వరి దిగుబడి వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విఎఎలు బి.లావణ్య, బి.రవళి, తేజ, నర్సింగరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో మంగళవారం పర్యాటకులతో సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వాహనాలపైన తీరానికి చేరుకొని సమీపంలోని జీడి తోటల్లో వనభోజనాలు చేశారు. తీరం వెంబడి పర్యాటకులు పెద్ద ఎత్తున చేరడంతో స్థానికంగా ఉన్న మెరైన్ పోలీసులు అదపు చేశారు. సముంద్రంలోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు. పలు మండలాల నుంచి పర్యాటకులు తండోపతండాలుగా వచ్చి వన భోజనాలు చేశారు. కార్తీకమాసం గురువారం ఉన్నందున ఈ మూడు రోజులు పాటు వనభోజనాలు కొనసాగుతాయని పర్యాటకులకు తెలియజేశారు. అయితే ఏడాదికోసారి చేసే వనభోజనాలు ఎంతో ఆనందాన్ని ఇస్తాయని, ఏటా కార్తీక మాసంలో ఇటువంటి వనభోజనాలు నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతాన్ని ఎంతగానో అలరిస్తాయని స్థానికులు వెలిబుచ్చారు.

కుక్కల బెడద

ఎచ్చెర్ల : మండలంలోని పలు కూడళ్లలో కుక్కలు ఎక్కువగా సంచరిస్తుండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళ్లలో అయితే వాహనాల వెంబడి భౌ భౌ మంటూ వెనుక పడడంతో భయాందోళనకు గురవుతున్నారు. నవభారత్, కింతలిమిల్లు, ఫరీదుపేట, బైపాస్ కూడళ్ల వద్ద మాసం దుకాణాలు ఎక్కువగా ఉండడంతో వాటి వర్థాలు తినేందుకు ఎక్కువగా గుంపులు గుంపులుగా చేరుకున్నాయి.

లక్కుపురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - బూర్జ

సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు సందర్భంగా మంగళవారం మండలంలోని లక్కుపురంలో ఎంపిపి కర్నేన దీప ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఇందులో భాగంగా కాలువల్లోని పూడికలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు.

వీధిని శుభ్రం చేస్తున్న మహిళలు

పారిశుధ్యం మెరుగుకు కృషి

పరికరాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య పనులు మరింత మెరుగుపర్చేందుకు అన్ని రకాలూగా చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. 15వ ఆర్థిక సాయంఘం టైడ్ గ్రాంట్‌తో రూ.1.50 లక్షలతో కొనుగోలు చేసిన రెండు ఫాగింగ్ మిషన్లు, వాటి టూల్స్, అన్‌టైడ్ గ్రాంట్ 15వ ఆర్థిక సంఘం మొదటి వాయిదాతో 20 క్లీన్ ఆంధ్రా కాంపాక్ట్ బిన్స్‌లను కమిషనర్ రమేష్‌తో కలిసి పురపాక సంఘం కార్యాలయంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య పనులు వేగవంతం చేసేందుకు కావాల్సిన పరికరాలు సిద్ధం చేశామని తెలిపారు. ఒకటో వార్డు కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, 14వ వార్డు ప్రతినిధి నీలాపు ఢిల్లీ, ఇన్‌ఛార్జి ఎస్‌ఇ పృథ్వీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

254 మందికి నేత్ర వైద్య పరీక్షలు

సంతబొమ్మాళి: జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం ఆధ్వర్యాన మంళవారం 254 విద్యార్థులకు మంగళవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. సంతబొమ్మాళి మండలం పాత మేఘవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 216 మంది విద్యార్థులకు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల గొదలంలో 38 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.అవని తెలిపారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న 20 మందిని గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. ముగ్గురిని టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు. విద్యార్థులకు 'కంటి ఆరోగ్యం- సం రక్షణ'పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.కళావతి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పి దారపు హేమలత, ఆశా కార్యకర్తలు ఎస్.రాజేశ్వరి, ఎస్.పార్వతి, ఎం.కృష్ణవేణి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ప్రశంసాపత్రం అందజేస్తున్న నగేష్

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి- నందిగాం

గిరిజన గౌరవ దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15 నుంచి 21వ వరకు విశాఖపట్నంలోని గిరిజనుల సాంస్కృతిక శిక్షణా కేంద్రంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు గిరిజన విద్యార్థులకు నిర్వహించారు. 'స్వాతంత్ర ఉద్యమంలో గిరిజన పాత్ర' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో మండలంలోని జయపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి జిరాంబి సుమంత్ పాల్గొని ద్వితీయ స్థానం సాధించాడు. ఈయనకు ఐటిడిఎ పిఒ బి.నవ్యతో ఉప సంచాలకులు బి.నగేష్, మందస సహాయ గిరిజన సంక్షేమ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, సర్పంచ్ పినకాన జోగారావు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

పంచాయతీ అభివృద్ధికి చర్యలు

పలాస: మండలంలోని నీలావతి పంచాయతీలో రూ.14 లక్షలతో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ సొర్ర పద్మావతి మంగళవారం శంకుస్థాపన చేశారు. నీలావతి ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించడానికి 5వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో నిర్మించిన నీటి ట్యాంకర్, కుళాయిలను ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షలతో ఉపాధి హామీ నిధులతో పంచాయతీలో సిసి రహదారులు, కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు నీలావతి పంచాయతీ అభివృద్ధి పనులు విస్తృతంగా సాగుతున్నాయని ఆమె చెప్పారు. గతంలో ఎన్నడులేని విధంగా పంచాయతీల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పున కేటాయించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి కోరాడ ధనరాజ్, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సొర్ర తిరుపతిరావు, పంచాయతీ అధ్యక్షులు మచ్చ బాబూరావు, యూత్ అధ్యక్షులు జి.లోకేశ్వరరావు, సొర వీరాస్వామి, పాతిన రామారావు, పుచ్చ తాతా రావు, సోమయ్య ఢిల్లీరావు, శ్యామ్ పాల్గొన్నారు.

కుళాయిని ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మావతి

విద్యార్థుల్లో స్థాయిని పెంపొందించేందుకే శిక్షణలు

జలుమూరు : మాట్లాడుతున్న ఎంఇఒ మాధవరావు

ప్రజాశక్తి- జలుమూరు

ప్రభుత్వ పాఠశాలల్లో కరోనా కారణంగా వెనుకబడిన 3,4,5 విద్యార్థుల స్థాయిని పెంపొందించేందుకే ఉపాధ్యాయులకు 'తారలు'లో శిక్షణ ఇన్నామని ఎంఇఒ మాధవరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 2వ విడత 'తరాలు' శిక్షణను మంగళవారం ప్రారంభించారు. విద్యార్థుల్లో స్థాయిని పెంచే క్రమంలో ప్రథమ ఆర్గనైజేషన్ సహకారంతో కొన్ని కృత్యాల ద్వారా బోధనతో విద్యార్థుల స్థాయిని తెలుగు, గణితంలో స్థాయి పెంచే అభ్యసన, కెమికల్స్, మెలకువలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : తరగతి గదిలో కలిసి పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థుల్లో కొంతమంది వెనుకబాటుతనాన్ని గుర్తించి వారికి ప్రత్యేకంగా ఆటాపాటలతో పాటు వారిలో సృజనాత్మకతను వెలికితీయాలని మండల విద్య సంక్షేమాధికారి, ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. స్థానిక రిసోర్స్ కేంద్రంలో నాలుగు రోజులు ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను చక్కదిద్దాలన్నారు. సామాజిక, మానసిక, ఆరోగ్య, పౌష్టికాహారం అందించాల న్నారు. ఎడ్యుకేషన్ ఫౌండేషన్ మార్గదర్శకాల ప్రకారం టీచింగ్ యట్ రైట్ లెవెల్ అనే అంశంపై ముద్దాడపేట పాఠశాల నుంచి బమ్మిడి శ్రీనివాసరావు, బొబ్బిలిపేట పాఠశాల నుంచి మెట్ట సన్యాసి బట్లు రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ నుంచి బొడ్డేపల్లి రఘు, క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్లు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ : మాట్లాడుతున్న ఎంఇఒ రామకృష్ణ

ఆమదాలవలస : మాట్లాడుతున్న కూర్మారావు

బూర్జ : విద్యార్థుల్లో అభ్యసనశక్తిని వెలికి తీసేందుకే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంఇఒ రామకృష్ణ తెలిపారు. స్థానిక ఎంఆర్‌సిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 30న అంతర పాఠశాలల క్రీడా పోటీలను బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఇనర్వహిస్తున్నామని తెలిపారు. వాలీబాల్, కబాడీ, ఖోఖో వంటి ఆటల పోటీలు సీనియర్, జూనియర్ బాల బాలికలకు నిర్వహిస్తున్నామని చెప్పారు. హెచ్‌ఎం ధర్మాన కృష్ణవేణి, స్పోర్ట్స్ ఆర్గనైజర్ నెల్లి వెంకటర మణ, పి.గణపతి, మన్మథ, ఈది అప్పన్న, రమణా రావు, సునీత, శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

'ఐతమ్'లో ఎఫ్‌పి ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఆధ్వర్యాన 'ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ప్రాక్టీసెస్' అనే అంశంపై ఈ నెల 21 నుంచి 27 వరకు అధ్యాపకులకు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిసోర్స్ పర్సన్లుగా జాతీయ, అంతర్జాతీయ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, నిర్మాణరంగంలో నిష్ణాతులైన వారు పాల్గొని తమ అనుభవాలను వెల్లడిస్తారని పేర్కొన్నారు. ఐఐటి దార్వాడ్ ప్రొఫెసర్ వి.ఆర్.దేశాయ్, ఐఐటి ఖరగ్పూర్ ప్రొఫెసర్ బ్రజేష్‌కుమార్, వాల్గా యూనివర్సిటీ ప్రొఫెసర్ బద్రీనారాయణ రత్, ఎతోపియా జంబాల యూనివర్సిటీ ప్రొఫెసర్ వినయ్ పట్నాయిక్, ఎన్ఐటి రౌంకెలా ప్రొఫెసర్ సిఆర్ పాత్రో, ఓమన్ మిడిల్ ఈస్టు కాలేజు చెందిన ప్రొఫెసర్ రామ్చరణ్ మించిర్యాల, విశాఖ జివిపిసిఇ ప్రొఫెసర్ జి.పాపారావులతో పాటు సింగపూర్ యు.ఎం.సర్వీసెస్ సిఇఒ శ్రీదేవ్, తెలంగాణా సిరీ కన్సల్టెన్సీ చీఫ్ కన్సల్టెంట్ డి.శ్రీనివాసరావు, అల్ట్రాటెక్ సిమెంట్స్ హెడ్ బి.రవికుమార్, ఐజిబిసి బెంగుళూర్ శాస్త్రవేత్త మావులాటి రేఖలు వారం రోజుల పాటు జరిగే ఆన్‌లైన్ శిక్షణలో పాల్గొంటారని చెప్పారు. ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్‌డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ పి.దినకర్, కో-కన్వీనర్ డాక్టర్ హెచ్.రామ్మోహన్, కో-ఆర్డినేటర్ డి.గోవిందరాజులు తరగతులను పర్యవేక్షిస్తారని తెలిపారు.

మెళియాపుట్టి : సామగ్రిని అందజేస్తున్న వెంకటరమణ

పలువురు ఆర్థికసాయం

మాజీ ఎమ్మెల్యే సహాయం...

మెళియాపుట్టి : మండలంలో వెంకటాపురం పంచాయతీ ఎగువబందపల్లి అగ్నిబాధిత కుటుం బాలకు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సహాయాన్ని అందించారు. తొమ్మిది కుటుంబాలకు వంట పాత్రలు, బట్టలు, కూరగాయలు, బియ్యం పంపిణీ చేశారు. అలాగే అగ్నిప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వపరంగా పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. బాధితుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి బైరిసింగి దినకర్, మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు భూర్ల లలిత కుమారి, సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతి, వసంతరావు, శ్రీధర్, షణ్ముఖరావు పాల్గొన్నారు.

అభయం ఫుడ్ బ్యాంక్ ...

టెక్కలి రూరల్ : టెక్కలి పరిసర ప్రాంతాల్లో చాలా మంది అభాగ్యులు ఆకలితో అలమటించడం చూసి చలించిన టెక్కలి అభయం యువజన సేవా సంఘం అంబేద్కర్ కూడలి దగ్గర ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు 50 మంది అభాగ్యులకు ఆకలి తీర్చుతున్నారు. మంగళవారానికి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వారణాసి గోవింద్, చింతాడ గణపతి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఎన్.సింహాచలం, బోయిన నాగరాజు, మున్నా, యస్.రాజేష్, తిరుమలరావు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ట్రస్టు...

పోలాకి : ఈ నెల 11న అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన గుప్పెడుపేట అగ్ని బాధితులకు కొత్తూరు భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు ఆదుకున్నారు. రూ.45 వేలు విలువ చేసే నిత్యవసర సరుకులు, దుస్తులు, బిందెలు, బకెట్లు, రెండు కింటాళ్ల బియ్యం అందించారు.

పోలాకి : సామగ్రిని పంపిణీ చేస్తున్న సభ్యులు

కొత్తూరు: ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

కొత్తూరు: మండలంలోని నేరడికి చెందిన తొగిరి శ్రీను, గోరజోలు రవణమ్మ, కంబాల తాతయ్య, అలాగే ఒంద్రుజోలకు చెందిన మాసింగి నారాయ ణరావులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సామాజిక వేత్త, తెలుగుదేశం పార్టీ నాయకులు మామిడి గోవిందరావు రూ. ఆరేసి వేలు చొప్పున రూ.18 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజకీయాలకతీతంగా మరెన్నో సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మడపాన రామరాజు, ఆరుబోలు దశరథ, వాలిపల్లి వెంకటరమణ, పిండి రామారావు, బిల్లింగి భాస్కరరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

పలాస : మందులను పంపిణీ చేస్తున్న వెంకటరమణ

కవిటి : రోగులను పరీక్షిస్తున్న రామారావు

గ్రామీణులకు చేరువగా వైద్య సేవలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామీణులకు చేరువగా వైద్య సేవలు తీసుకొని రావడమే ఫ్యామిలీ ఫిజీషియన్ ముఖ్య ఉద్దేశమని వైద్యాధికారులు డాక్టర్ బమ్మిడి శరత్‌చంద్ర, డాక్టర్ ఎం.రాకేష్ లు అన్నారు. మండలంలోని పెద్దబొడ్డపాడు సచివాలయంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో గ్రామ పరిధిలోనే వైద్యం అందేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో 104 విద్యాధికారి డాక్టర్ షేక్ రజియా భాను, హెల్త్ సూపర్ వైజర్లు ఎస్.చక్రధరరావు, టి.లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్ పి.యశోద, ఎఎన్ఎం మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు టి.చిన్నమ్మ, బి.తేజావతి, కోటేశ్వరి, సంతోషి పాల్గొన్నారు.

కవిటి: ఫ్యామిలీ ఫిజీషియన్‌తో గ్రామస్థాయిలో మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నట్టు కరాపాడు పెద్దలు పిట్ట పురుషోత్తం, ఇసురు లోకనాథం అన్నారు. మండలంలోని కరాపాడు సచివాలయం ఆవరణలో ఎంఎంయు 104 వైద్యుడు డాక్టర్ పూడి రామారావు నేతృత్వంలో వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరం వద్దకు రాలేని వారిని ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మాదిన కృష్ణారావు, హెచ్ఎ శేఖర్, హెచ్.వి.భారతి, ఎంఎంయు 104 సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని నేత్ర వైద్యాధికారి డాక్టర్ రోణంకి వెంకటరమణ అన్నారు. గాంధీనగర్, పద్మనాభపురం కాలనీ సచివాలయం డాక్టర్ వైఎస్ఆర్ నేత్ర వెలుగు, అవ్వ తాత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు అడ్మిన్ జి.లావణ్యకుమార్, వెల్ఫేర్ సెక్రటరీ జి.జగదీశ్వరరావు, వార్డు హెల్త్ సెక్రటరీ ఇందిర, ఆశాజ్యోతి, ఎం.సుజాత, డి.సురేష్‌బాబు, టి.మురళి, ఆశ, పద్మావతి పాల్గొన్నారు.

కార్డులను చూపిస్తున్న విద్యార్థులు, రెడ్‌క్రాస్ సిబ్బంది

విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రుధిర ప్రాజెక్టు ఆధ్వర్యాన మంగళవారం పొందూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు రక్తగ్రూప్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని సుమారు 220 మంది విద్యార్థులకు ఈ పరీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డి.రామారావు, రామ్‌మనోహర్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాళ్లకూరి శాంతారాం, డిగ్రీ కళాశాల కమిటీ చైర్మన్ బి.జనార్ధనరావు, టెక్నీషియన్స్ పవన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

జ్ఞాపికను అందజేస్తున్న సువర్ణ

ఉత్తమ గ్రంథాలయాధికారులకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పనిచేస్తున్న పెంట ఈశ్వరరావు, తలే రాంబాబులకు ఉత్తమ గ్రంథాలయాధికారులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, కార్యదర్శి బుర్రి కుమార్ రాచా, చైర్‌పర్సన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ, డిప్యూటి లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకుల సమక్షంలో వారికి దుశ్శాలువ కప్పి జ్ఞాపికని అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ వయసులో చిన్నవాళ్లు అయినా విధి నిర్వహణలో అంకితభావం, చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ఉత్తమ గ్రంథాలయాధికారులుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ర్యాలీ నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

దేశానికి హిందూ మతోన్మాదం ప్రమాదకరమని, దీనిని ఎదుర్కోడానికి పోరుబాట శరణ్యమని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. మర్రిపాడులోని శ్రీకాకుళం స్థూపం వద్ద 44వ స్మారక సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ అధికారం కోసం భారత లౌకిక విధానం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. రైతులకు సాగునీరు అందించలేని దుస్థితిలో జగన్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. నిత్యావసర సరుకులు సామాన్యులకు అందుబాటులో లేనివిధంగా ధరలు పెంచి వారి నడ్డి విరుస్తుందన్నారు. శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటంలో అమరులైన 360 మంది విప్లవ వీరులకు జోహార్లు అర్పించారు. స్థూపంపై జెండాను మురిపింటి వల్ల భార్య ఎరకమ్మ ఎగురవేశారు. అరుణోదయ కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిల వినోద్‌కుమార్, జుత్తు వీరాస్వామి, గొరకల బాలకృష్ణ, సోమేశ్వరరావు, మామిడి భీమారావు, రాపాక మాధవరావు, పోతనపల్లి కుసుమ, పిఒడబ్ల్యూ మురిపింటి తాతారావు, బదకల ఈశ్వరమ్మ, జోగి కోదండరావు, యువజన సంఘ నాయకుడు ఎస్.జగన్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న రమణమూర్తి

విద్యార్థి దశ కీలకం

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యార్థులు ఎటువంటి ప్రలోబాలకు లోనుకాకూడదని ఎహెచ్‌టియూ ఎఎస్ఐ డి.రమణమూర్తి అన్నారు. మండలంలోని లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన పిల్లలపై జరుగుతున్న దుష్ప్రభావాలు, హక్కులపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు, పంచాయతీ సెక్రటరీ బి.ప్రసన్న, బెజ్జిపురం యూత్‌క్లబ్ కో-ఆర్డినేటర్ పి.హేమలత, మహిళా పోలీస్ జి.భారతి, ఉపహార్ కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, 1098 సిబ్బంది డి.రాజు, శ్రావణి పాల్గొన్నారు.

అరసవల్లిలో మాస శివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని అనివేటి మండపంలో మంగళవారం మాస శివరాత్రి వేడుకులను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మహా పర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యాన అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం అభిషేకాలను నిర్వహించారు.

సృజనాత్మకను పెంపొందించేందుకే ఎగ్జిబిషన్

జలుమూరు: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని, సృజనాత్మక శక్తిని పెంపొందించడానికే పాఠశాల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని ఎంఇఒ బమ్మిడి మాధవరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు వివిధ ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రధానోపాధ్యాయులు పార్వతి, సైన్స్ ఉపాధ్యాయులు స్రవంతి, రాధిక పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒ మాధవరావు

పరిశీలిస్తున్న రవీంద్రనాయక్

భవన నిర్మాణ పనులు వేగవంతం

బూర్జ: మండల కేంద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భావన నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని విశాఖకు ఇఇ రవీంద్రనాయక్ అన్నారు. బూర్జ పిహెచ్‌సి భవన నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.1.50 కోట్ల నిధులతో ఆస్పత్రి భవన నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉందని, వర్షాలు, ఇతర కారణాలతో సకాలంలో పూర్తి కాలేదని చెప్పారు. డిసెంబరు నెలాఖరులోగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

ప్రజాశక్తి- కొత్తూరు

నరసన్నపేటలో బుధవారం నిర్వహించనున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి బహిరంగసభను విజయవంతం చేయాలని నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు పిలుపునిచ్చారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రెండో విడత భూ రీసర్వే ప్రారంభోత్సవానికి సిఎం వస్తున్నారని తెలిపారు. ఈ సభకు నియోజకర్గంలోని వైసిపి నాయకులు, రైతులు, మహిళలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు కొయిలాపు సంజీవరావు, రేగేటి కన్నయ్య, చల్లా ధర్మారావు, దారపు రామకృష్ణ, పి.వెంకటకృష్ణ, అగతముడి నాగేశ్వరరావు, లోకేష్, కె.తిరుపతిరావు, ఎల్.ఇందిర, ఎస్.రామారావు, ఎస్.ఉదయ్‌కుమార్, ఎస్.జనార్ధనరావు ఉన్నారు.

ఎండల మల్లన్న హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలస ఎండల మల్లికార్జున స్వామి హుండీ ఆదాయం మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ కార్తీకమాసంలో యాత్రికులు వేసిన విరాళాలు, టిక్కెట్ విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.35,80,815 వచ్చిందని తెలిపారు. గతేడాది కంటే రూ.పది లక్షలు అదనంగా ఆదాయం వచ్చిందని తెలిపారు.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయాధికారులు